తీసినా అవి మళ్ళీ అదే వేగంతో భర్తీ అవసాగాయి. అవతల అంతా తనకోసం ఎదురు చూస్తుంటారు. ఇంతలో శ్రీకృష్ణుడి ఇంటికి భోజనానికి బయలుదేరిన కర్ణుడు అర్జునుడికి కనబడ్డాడు. వెంటనే కర్ణుడి చేతిలో ఆ బంగారు పాత్రని ఉంచి చెప్పాడు అర్జునుడు.

"మిత్రమా! ఈ గిన్నెలోని నాణాలని కొన్నిటిని నేను దానం చేసాను. మిగిలినవి నువ్వు చెయ్యి."

కర్ణుడి చేతిలో ఆ బంగారు పాత్రని ఉంచి అర్జునుడు చల్లగా జారుకున్నాడు. కాని, తన వెనకే కర్ణుడు శ్రీకృష్ణుడి ఇంట్లోకి రావడం గమనించిన అర్జునుడు ఆశ్చర్యపోయాడు.

"ఇంత త్వరగా వచ్చేసావు. దానం మాట ఏంచేసావు?" ప్రశ్నించాడు.

"నువ్వు చెప్పినట్లే దానం చేసి వస్తున్నాను. ఆ గిన్నెని ఓ ముసలి బీదరాలి చేతిలో ఉంచి వస్తున్నాను." బదులు చెప్పాడు కర్ణుడు.

కర్ణుడికి దాన కర్ణుడన్న కీర్తి ఎందుకు వచ్చిందో వెంటనే అర్జునుడికి అప్పుడు కాని అర్థం కాలేదు.

## 22. స్వస్వరూపం

ఓ అడవిలో ఎవరితో సంబంధం లేకుండా చాలాకాలంగా జీవిస్తున్న తొలి మానవుల జంటలోని మగతనికి ఓ అద్దం దొరికింది. అలాంటిది అతను ఎన్నడూ అంతదాకా చూసి వుండలేదు. అందులో కనిపించింది దేవుడి మొహం అనుకుని దాన్ని పూజ గదిలో వుంచి నిత్యం పూజించసాగాడు.

అతని భార్య ఇది గమనించి ఆ అద్దాన్ని తీసి చూసింది. అందులో ఆమెకి తన మొహం ప్రతిబింబం కనిపించింది. అది తన సవతి మొహం అనుకుందామె. ఆ మగతనికి కాని, అతని భార్యకి కాని ఆ అద్దంలో కనిపించింది తామే అని తెలీదు.

మన అసలు స్వస్వరూపం ఏమిటో తెలీని మన గతి కూడా ఆ జంట గతి లాంటిదే. దాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడమే వివేకం.